www.dainamicnews.com
శుభోదయ
# డైనమిక్
ప్రజల కోసం - ప్రగతి కోసం
dianamicnews Tv
dianamicnews.epaper.com

విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న
డైనమిక్ దినపత్రికలో
అన్ని మండలాల వారీగా
విలేకరులు కావలెను.

డైనమిక్
CELL : 96523 03089

తెలంగాణా- ఏపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | శనివారం 12 సెప్టెంబర్ 2026 | వెల : 4/-



## స్టార్టప్‌ల కోసం భారత్‌లో ప్రపంచస్థాయి ఎకోసిస్టమ్

- బ్రిక్స్ దేశాలు దీన్ని వాడుకోవచ్చు: మోదీ
- ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపర ఆంక్షలు పెరుగుతుంటే, భారత్ ఆర్థిక బంధాల్ని బలోపేతం చేస్తుందన్న మోదీ
- వ్యాపార భాగస్వామ్యాలే వెన్నెముక అని ప్రస్తావించిన పుతిన్
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉందన్న ఇరాన్ అధ్యక్షుడు
- ప్రపంచ జీడీపీతో పోలిస్తే బ్రిక్స్ దేశాల ఆర్థిక వృద్ధి రెట్టింపు వేగంతో దూసుకెళ్తోంది

# కులగణన తప్పనిసరి

- బీసీల జనాభా లెక్కలు తేల్చాలి..
- కులగణన చేపట్టాలి
- బీసీ రిజర్వేషన్లు దానం కాదు.. హక్కు: మంత్రి వాకిటి శ్రీహరి
- కేంద్ర జనగణనలో బీసీల కులగణన తప్పనిసరిగా చేపట్టాలని డిమాండ్



**హైదరాబాద్**

దేశవ్యాప్తంగా బీసీల జనాభా ఎంత ఉందో కచ్చితంగా తేల్చడంతోపాటు.. వారి సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీలో కులగణనపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటం ఫలితంగా లభించిన హక్కు అని స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం చేయాలంటే ముందుగా వారి జనాభా ఎంత ఉందో - మిగతా 3లో

## విద్యతోనే సామాజిక
# మార్పు సాధ్యం



- బడ్జెట్‌లో విద్యకు 15 శాతం కేటాయించాలనేదే నా లక్ష్యం
- విద్యారంగంలో ఉత్తమ విధానాలు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నా
- ఏడాదిలో విద్యకు రూ.27,663 కోట్లు కేటాయించాం
- పాలిటెక్నిక్‌ల ప్రైవేటీకరణ ప్రశ్నే లేదు
- మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా తెలంగాణ విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చుతున్నాం
- శాసనసభ సమావేశాల్లో భాగంగా విద్యాశాఖపై జరిగిన చర్చలో సీఎం


**హైదరాబాద్**

విద్యే జీవితాలను మార్చే శక్తి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుకు దూరమైతే ఎంత ఆస్తి ఉన్నా సామాజికంగా వెనుకబడే పరిస్థితి ఉంటుందని చెప్పారు. 2024లో నిర్వహించిన సీపెక్ సర్వేలోనూ ఇదే విషయం వెల్లడైందన్నారు. అక్షరం ఒక్కటే మనిషి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా తెలంగాణ విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చుతున్నామని అసెంబ్లీలో తెలిపారు. బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలనేదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అందరూ జెన్?జీ గురించి ఆలోచిస్తుంటే తాను జెన్ ఆల్ఫా, జెన్ బీటా గురించి కూడా ఆలోచిస్తున్నానన్నారు. దేశం భవిష్యత్ తరగతి గదుల్లో ఉందని సంపూర్ణంగా విశ్వసించానని తెలిపారు. ప్రపంచంలోనే ఉత్తమ విద్యా విధానాలను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా విద్యాశాఖపై జరిగిన చర్చలో సీఎం సుదీర్ఘంగా మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యకు రూ.18,955 కోట్లు కేటాయిస్తే - మిగతా 3లో

BRICS 2026

## బ్రిక్స్ సదస్సు సర్వం సిద్ధం

- ఏఐ నుంచి వాణిజ్యం వరకు వీటిపైనే ఫుల్ ఫోకస్!
- శని, ఆదివారాల్లో జరిగే 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు సర్వం సిద్ధం
- ఈ మెగా సదస్సుకు హాజరుకానున్న ప్రపంచంలోని పలుదేశాల అగ్రనేతలు
- ముఖ్యంగా చైనా అధినేత జిన్‌పింగ్ ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌కు రావనుండటం ఆసక్తి



## 'భారత్- రష్యా బంధానికి పునాది వేసింది నెహ్రూనే'

- కాంగ్రెస్ తీవ్ర వ్యాఖ్యలు- బీజేపీ కౌంటర్!
- రష్యాతో మైత్రి క్రెడిట్‌కు సంబంధించి కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం
- రష్యాతో బలమైన సంబంధాలకు నెహ్రూనే కారణమంటున్న కాంగ్రెస్
- దేశాన్ని కాంగ్రెస్ ముంచితే మోదీ నిర్మించారని బీజేపీ కౌంటర్!



## పురపాలక పాలనలో
# ట్రాన్స్‌జెండర్లు

- అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం
- మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం
- తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- హైదరాబాద్ వెలుపల 9 కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌కు ప్రాతినిధ్యం
- ప్రజా జీవితంలో భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యమన్న ప్రభుత్వం
- బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ, సీపీఐ సభ్యులు

**హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ - మిగతా 3లో

## గ్రీన్ ఎనర్జీని బలోపేతం
# చేయడమే లక్ష్యం

- రైతుల మోటార్లకు ఎట్టి పరిస్థితుల్లో మీటర్లు పెట్టబోము
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కేంద్రం తెచ్చిన ఆర్‌డీఎస్ఎస్ పథకంలో ఎక్కడా రైతుల వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలనే నిబంధన లేదు
- ఎంపిక చేసిన గ్రామాల్లో మైక్రో గ్రిడ్ల నిర్మాణం
- థర్మల్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటూ వెళ్లాల్సిన అవసరముంది



**హైదరాబాద్**

రైతుల మోటర్లకు ఎట్టి పరిస్థితుల్లో మీటర్లు పెట్టబోమని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్‌డీఎస్ఎస్ పథకాన్ని వినియోగించుకుంటామన్నారు. అందులో ఎక్కడా వ్యవసాయ మోటర్లకు మీటర్లకు పెట్టాలనే నిబంధన లేదని భట్టి విక్రమార్క తెలిపారు. అలాంటి భయాందోళన సృష్టించవద్దని ఆయన సూచించారు. థర్మల్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటూ వెళ్లాల్సిన అవసరముందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించడానికి ప్రభుత్వం ఏటా రూ.14,000 కోట్లు, 53 లక్షల గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 5,000 కోట్లు చెల్లిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ విధంగా కేవలం సబ్సిడీల రూపంలోనే ఏటా దాదాపు రూ.19,000 కోట్లు ఖర్చవుతోందని ఆయన వివరించారు. ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ఖజానాపై భారం తగ్గడంతో పాటు రైతులు స్వయంసమృద్ధి సాధిస్తారన్నారు. పగటిపూట లభించే సోలార్ విద్యుత్ రాత్రివేళ అందుబాటులో ఉండనందున, ఎంపిక చేసిన గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌తో మైక్రో గ్రిడ్లను నిర్మిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోలార్ విద్యుత్‌తో పాటు బ్యాటరీ స్టోరేజ్ ద్వారా గ్రామాలకు విద్యుత్ ఇచ్చే 'మైక్రో గ్రిడ్' ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా(పైలట్) చేపట్టామని - మిగతా 3లో



## ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు
# పుతిన్ సవాల్

- 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ వాటా 40 శాతానికి పైగా ఉందన్న పుతిన్



## యువత నిజాయతీగా కష్టపడుతున్నప్పటికీ, ఈ వ్యవస్థ వారిని నిరాశపరుస్తోంది

- విద్యా వ్యవస్థలో జరుగుతున్న పేపర్‌లీక్, అధిక ఫీజుల గురించి ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు
- వ్యవస్థను మార్చాలంటే ప్రతి విద్యార్థి స్వరాన్ని వినడం అత్యవసరమన్న ప్రతిపక్షనేత

# బ్రిక్స్ సదస్సు సర్వం సిద్ధం

ప్రపంచ దేశాల చూపు ఇప్పుడు భారత్ వైపు మళ్లింది. అంతర్జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని ఢిల్లీ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భారత్ అధ్యక్షతన ఢిల్లీ వేదికగా శని, ఆదివారాల్లో జరిగే 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు ప్రపంచంలోని పలుదేశాల అగ్రనేతలు హాజరవుతున్నారు. రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్ సహా 11సభ్య దేశాల అధినేతలు పాల్గొననున్నారు. ముఖ్యంగా చైనా అధినేత జిన్‌పింగ్ ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌కు రావనుండటం ఆసక్తి రేపుతోంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, వాణిజ్య ఉద్రిక్తతలు, ఆర్థిక సవాళ్ల నడుమ గ్లోబల్ సౌత్ దేశాల అభివృద్ధి ప్రాధాన్యతలను గళమెత్తేందుకు భారత్ ఈ వేదికను సిద్ధం చేసింది. ప్రపంచ జనాభాలో సగం వాటా ఉన్న ఈ బ్రిక్స్ కూటమి ఢిల్లీ వేదికగా ఏ నిర్ణయాలు తీసుకోబోతోందో ఈ కథనంలో చూద్దాం.

**ఉమ్మడి తీర్మానంపై ఏకాభిప్రాయం కుదురుతుందా?**

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక అస్థిరత, ఉక్రెయిన్- పశ్చిమాసియా సంక్షోభాలు, అమెరికా వాణిజ్య- సుంకాల విధానాల నేపథ్యంలో ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం"అనే థీమ్‌తో భారత్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ సదస్సును నిర్వహిస్తోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి అయిన గ్లోబల్ సౌత్ ఆర్థికాభివృద్ధికి బ్రిక్స్‌ను ఒక ఇంజిన్‌గా మార్చాలని భారత్ పక్కా వ్యూహంతో అడుగులు వేసింది. ముఖ్యంగా ఆహార భద్రత, కృత్రిమ మేధ, ఇంధన స్థిరత్వం, సప్లై చైన్ సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా అగ్రనేతలు ఈ వేదికపై సమగ్రంగా చర్చించనున్నారు. అయితే, పశ్చిమాసియా సంక్షోభం విషయంలో సభ్య దేశాలైన ఇరాన్, యూఏఈ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నందున ఈ సదస్సులో ఉమ్మడి తీర్మానంపై ఏకాభిప్రాయం కుదురుతుందా? లేదా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




**ఏడేళ్ల విరామం అనంతరం తొలిసారిగా జిన్‌పింగ్ భేటీ**

ఈ సదస్సులో ప్రధాన ఆకర్షణగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పాల్గొంటున్నారు. 2020 గల్వాన్ ఘర్షణల తర్వాత దాదాపు ఏడేళ్ల విరామం అనంతరం ఆయన తొలిసారి భారత్‌లో పర్యటిస్తున్నారు. వీరితో పాటు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్-సిసి ఈ సదస్సులో పాల్గొనున్నారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ సహా డబ్ల్యూటీఓ, డబ్ల్యూహెచ్ఓ, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధులు కూడా ఈ సమావేశాలకు హాజరుకానున్నారు. ఇంకా ఉగాండా, నైజీరియా, క్యూబా, బెలారస్, వియత్నాం, కజకిస్థాన్ తదితర భాగస్వామ్య దేశాల ప్రతినిధులు ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటారని విదేశాంగ శాఖ తెలిపింది.

**ఇక, సదస్సు షెడ్యూల్ విషయానికొస్తే,**

శనివారం మధ్యాహ్నం 02:35 నిమిషాలకు ఇంక్లూసివ్ గ్లోబల్ గవర్నెన్స్ అనే అంశంపై తొలి సెషన్ ప్రారంభమవుతుంది. సాయంత్రం 04:25 నిమిషాలకు భారత్ ఇన్నోవేట్స్ ఎగ్జిబిషన్‌ను నేతలు తిలకిస్తారు. సాయంత్రం 05:05 నిమిషాలకు భారత్ మండపం ప్రాంగణంలో సాంప్రదాయక గ్రూప్ ఫొటో, మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుంది. రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చే ప్రత్యేక విందుతో మొదటి రోజు ముగుస్తుంది. ఆదివారం ఉదయం ప్రధాన సమావేశాల అనంతరం ఢిల్లీ డిక్లరేషన్ విడుదలతో ఈ చారిత్రక సదస్సు ముగియనుంది. కాగా, భారత్ నాల్గోసారి ఈ సదస్సుకు అధ్యక్షత వహిస్తోంది. గతంలో 2012, 2016, 2021లో భారత్ అధ్యక్షత వహించింది. చివరగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు 'ఢిల్లీ డిక్లరేషన్' ఆమోదంతో ముగుస్తుంది.

# స్టార్టప్‌ల కోసం భారత్‌లో ప్రపంచస్థాయి ఎకోసిస్టమ్

ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అడ్డంకులు పెరుగుతున్న సమయంలో భారత్ మాత్రం ఇతర దేశాలతో ఆర్థిక సంబంధాల్ని బలోపేతం చేసేలా ఆర్థిక వారధుల్ని (ఆర్థిక బంధాలు) నిర్మిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు భారత్ సుమారుగా 40 దేశాలతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్ కుదుర్చుకుందని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ లీడర్స్ సెషన్‌లో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. వ్యాపారాలకు అడ్డంకుల్ని తొలగించడం, ఈ రంగంలో సరికొత్త అవకాశాల్ని మరింత విస్తరించడంపైనే భారత్ దృష్టి సారిస్తుందని, ఇదే తమ విధానమని వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ 12-13 తేదీల్లో ఢిల్లీ భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుండగా, దాని ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశం నిర్వహించారు.

"నేడు ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపరమైన ఆంక్షలు (ట్రేడ్ బారియర్స్) పెరుగుతున్నప్పటికీ, భారత్ మాత్రం ఆర్థిక సంబంధాల్ని బలోపేతం చేస్తోంది. ఆర్థిక వారధుల్ని నిర్మిస్తోంది. 2014 నుంచి మేము దాదాపు 40 దేశాలతో స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నాం. అందుకే బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న ఈ వేళ భారత్ వ్యవసాయం, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, స్మార్ట్ గ్రిడ్స్ వంటి రంగాల్లో కొత్త సహకార నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేశాం."

**'ఆ పరిశ్రమలకు మేం ప్రత్యేక ప్రోత్సాహం ఇస్తున్నాం'**

ఇంకా తాము స్టార్టప్స్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహం ఇస్తున్నామని మోదీ చెప్పారు. ఇందులో భాగంగా బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్,



బ్రిక్స్ ఎంఎస్ఎంఈ పోర్టల్, బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ వంటి వినూత్న వేదికల్ని ప్రారంభించామని, బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు వీటిని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 2006లో కేవలం 4 దేశాలతో ప్రారంభమైన బ్రిక్స్ ప్రయాణం, ఈ 20 ఏళ్లలో సభ్యులు, భాగస్వాములు కలిపి 21 దేశాల కుటుంబంగా అవతరించిందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ఇప్పుడు ప్రపంచ జనాభాలో సుమారు 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికిపైగా వాటా బ్రిక్స్ దేశాలదేనని స్పష్టం చేశారు.

ప్రపంచ జీడీపీతో పోలిస్తే బ్రిక్స్ దేశాల ఆర్థిక వృద్ధి రెట్టింపు వేగంతో దూసుకెళ్తోందని మోదీ వ్యాఖ్యానించారు. ఇక ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి నెలకొన్నా భారత్ మాత్రం ఇంధనం నుంచి టెక్నాలజీ వరకు శక్తిమంతమైన సరఫరా వ్యవస్థల్ని ఏర్పాటు చేసిందని, నిలకడగా వృద్ధి, ఆర్థిక స్థిరత్వానికి భారత్ గ్యారెంటీ ఇస్తోందని పేర్కొన్నారు. ఇదే సెషన్‌లో డిజిటల్ పేమెంట్స్ గురించి కూడా ప్రస్తావించారు. భారత సాంకేతికత యూపీఐ ద్వారా ఆర్థిక సేవలు విస్తృతంగా ప్రజలకు చేరాయని, డిజిటల్ ట్రాన్సాక్షన్లకు మరింత ఊతం లభించిందన్నారు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా జరిగే రియల్ టైమ్ డిజిటల్ పేమెంట్స్‌లో 50 శాతం యూపీఐ టెక్నాలజీనే వినియోగిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

**వ్యాపార భాగస్వామ్యాలే వెన్నెముక- పుతిన్**

బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ప్రసంగించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు, అంతర్జాతీయ సంబంధాల్ని మరింత బలోపేతం చేసేందుకు నమ్మకమైన వ్యాపార భాగస్వామ్యాలే మూలస్తంభాలని, వెన్నెముక వంటివని స్పష్టం చేశారు. బ్రిక్స్ సభ్యదేశాల మధ్య వ్యాపార భాగస్వామ్యాలు పెరుగుతుండటం శుభపరిణామం అన్నారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులు జరుగుతున్నాయని పుతిన్ వివరించారు. 20వ శతాబ్దం రెండో అర్ధభాగంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించినట్లుగా చెప్పుకుంటున్న అభివృద్ధి చెందిన దేశాల స్థానంలో, ఇప్పుడు కొత్త ఆర్థిక చోదక శక్తులు (గ్లోబల్ గ్రోత్ ఇంజిన్స్) రూపుదిద్దుకుంటున్నాయన్నారు.


**ఇది అత్యంత క్లిష్ట సమయం- పెజెష్కియాన్**

ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అన్నారు. ఇలాంటి సవాళ్లను బ్రిక్స్ సమర్థంగా ఎదుర్కోవాలని బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశంలో ఆయన పిలుపునిచ్చారు. సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు పెరిగిపోతున్నాయని పెజెష్కియాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా రాజకీయ ఒత్తిడి తేవడానికి ఆర్థిక పర ఆంక్షలనే ఆయుధాలుగా వాడుకుంటున్నారని విమర్శించారు.

# 'భారత్- రష్యా బంధానికి పునాది వేసింది నెహ్రూనే'

ఢిల్లీ వేదికగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో దేశంలో రాజకీయం తీవ్ర స్థాయికి చేరుకుంది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ వేళ భారత్- రష్యా మైత్రి క్రెడిట్ విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. ప్రధాని మోదీ తన సొంత ప్రచారాన్ని పక్కనబెడితే, ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా బలమైన సంబంధాలే ఉన్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. 1950- 80ల కాలంలోనే తొలుత అప్పటి ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ హయాంలోనే ఉక్కు నుంచి మొదలుకొని ఇంధనం, రక్షణ, అంతరిక్ష రంగాల్లో రష్యాతో (అప్పటి సోవియట్ యూనియన్) భారత్‌కు బలమైన సంబంధాలకు పునాదులు పడ్డాయని ఆయన గుర్తు చేశారు.

1955లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ యూనియన్‌లో 16 రోజుల పాటు పర్యటన చేయడం, అదే ఏడాది సోవియట్ నాయకులు భారత్‌లో పర్యటించడం ఈ సంబంధాలకు ముఖ్యమైన మలుపుగా జైరాం రమేశ్ అభివర్ణించారు. 1971లో ఆగస్ట్ 9న ఢిల్లీలో భారత్-సోవియట్ శాంతి, స్నేహం, సహకార ఒప్పందం కుదిరిందని గుర్తు చేశారు. ఇక 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత కొంత కాలం రష్యా- భారత్ సంబంధాలకు బ్రేక్ పడిందని, 1998లో మళ్లీ ప్రిమకోవ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ నాయకత్వంలో సంబంధాలు మళ్లీ బలపడ్డాయని వెల్లడించారు. ఆ తర్వాత వాజ్‌పేయీ, మన్మోహన్ సింగ్ కాలంలో కీలక బ్రహ్మోస్ క్షిపణి ప్రాజెక్ట్



సహా ఎన్నో భాగస్వామ్యాలు విస్తరించాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ చేశారు.

'దాదాపు ఏడేళ్ల పాటు సాగిన బ్రహ్మోస్ మిసైల్ జాయింట్ వెంచర్ ప్రక్రియను పుతిన్, అప్పటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీతో కలిసి తుదిరూపు ఇచ్చారు. ఆ తర్వాత మన్మోహన్ సింగ్ హయాంలో ఈ సహకారం మరింత విస్తరించింది. ఢిల్లీ, హైదరాబాద్, తిరువనంతపురంలో సంబంధిత కేంద్రాలు ఏర్పాటు చేశారు' అని జైరాం రమేశ్ తెలిపారు. ఇంకా రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదెవ్ 2010 డిసెంబర్ 22న ఐఐటీ బాంబేను సందర్శించిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

**కాంగ్రెస్ దేశాన్ని ముంచితే మోదీ నిర్మించారు- బీజేపీ ఎదురుదాడి**

అయితే కాంగ్రెస్ విమర్శలపై బీజేపీ కూడా అంతే ఘాటుగా స్పందించింది. విదేశాంగ విధానంపై చర్చ జరిగిన ప్రతిసారీ కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు దేశంలో ప్రతికూల వాతావరణం సృష్టిస్తున్నాయని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. కాంగ్రెస్ దేశాన్ని ముంచితే, ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ పునర్నిర్మించిందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉండేదని, అదే ఇప్పుడు మోదీ నాయకత్వంలో ప్రపంచంలోని టాప్- 5 ఆర్థిక వ్యవస్థల్లో భారత్ చేరిందని అన్నారు. ప్రస్తుతం భారత్ బ్రిక్స్‌లోనే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనూ మంచి స్థానంలో నిలిచిందని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం, సప్లై చెయిన్‌లో అంతరాయాలు, గల్ఫ్‌లో యుద్ధం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ భారత వృద్ధి రేటు 7.8 శాతంగా ఉందని తెలిపారు.

**బ్రిక్స్‌లో ఇండియా మాయమయ్యే పరిస్థితి ఉండేది- సంబిత్ పాత్రా**

ఇదే సమయంలో బీజేపీ ఎంపీ, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా మరింత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 2011-12 కాంగ్రెస్ పాలన సమయంలో భారత్ అధిక ద్రవ్యోల్బణం, అలాగే రూపాయి అత్యంత కనిష్ఠ స్థాయిలకు పతనం కావడం కారణంగా బ్రిక్స్ కూటమిలోని 'X- ఫర్ ఇండియా' స్థానంలో ఇండోనేసియాను చేర్చాలనే కథనాలు వచ్చాయని గుర్తుచేశారు. అదే భారత్ ఇప్పుడు బ్రిక్స్‌లో బలమైన భాగస్వాముల్లో ఒకటిగా నిలిచిందన్నారు. బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం వల్ల భారత్‌కు ప్రయోజనమేంటి? అని కాంగ్రెస్ ప్రశ్నించిన నేపథ్యంలో బీజేపీ ఇలా స్పందించింది. కిందటి రోజు కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం- బ్రిక్స్ సదస్సుల వల్ల దేశానికి పెద్దగా ఒరిగేదేం లేదని వ్యాఖ్యానించారు.

## కేసుల దర్యాప్తులో జాప్యం వద్దు




**మెదక్, శుభోదయ డైనమిక్** పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పురోగతిని సమీక్షించారు. కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు.వినాయక చవితి నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి, గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. విద్యుత్, అగ్నిప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విపీవోల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమర్థవంతంగా దర్యాప్తు చేసిన ఐఓలు రేణుకరెడ్డి, వెంకటరాజాగౌడ్, రంగా కృష్ణతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు.

## పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి




**నల్లగొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో పెండింగ్, చీటీఐ, ఆస్తి, సైబర్, చీఞూా, మహిళలు--చిన్నారులపై నేరాలు, రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు.సైబర్ మోసాల బాధితులు వెంటనే 1930కు సమాచారం అందించేలా అవగాహన కల్పించాలని, ఫిర్యాదు అందిన వెంటనే బ్యాంకులతో సమన్వయం చేసి నగదును ఫ్రీజ్ చేయించాలని సూచించారు. దొంగతనాలు, ఆస్తి నేరాల్లో నిందితులను త్వరగా అరెస్టు చేసి ఆస్తిని పూర్తిగా రికవరీ చేయాలన్నారు.నేరాలు జరిగే ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, వాహనాల తనిఖీలు పెంచాలని, గంజాయి--మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ సూచించారు.

## ఆయుష్ వైద్య సేవలను విస్తృతం చేయాలి



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** ఆయుష్ వైద్య సేవలను ప్రజలు మరింతగా సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుర్వేదం, యునాని, హోమియోపతి తదితర ఆయుష్ వైద్య విధానాల సేవలను విస్తరించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో పంచకర్మ వంటి సాంప్రదాయ చికిత్సలను శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.సమావేశంలో డీఎంహెచ్‌వో డా. పి. వెంకట రమణ, ఐఎంఏ అధ్యక్షుడు డా. రమేశ్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. మాధవ్ కుమార్, ఆయుష్ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 12, 13న ప్రత్యేక ఓటరు ప్రచారం




**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** ఎస్ఐఆర్--2026లో భాగంగా సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ఓటరు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. రెండు రోజుల పాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు అందుబాటులో ఉంటారని చెప్పారు.ఓటర్లు డ్రాఫ్ట్ జాబితా, ఏఎస్‌డీడీ జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం-6, తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం-7, పేరు, చిరునామా సవరణలకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నో మ్యాపింగ్, అనోమలీస్ నోటీసులు అందుకున్నవారు ఆధార పత్రాలను బీఎల్ఓలకు అందజేయాలని కోరారు.యువతకు విజ్ఞప్తి: అక్టోబర్ 1, 2026 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి



**నల్గొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** ఈనెల 17న నల్గొండ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు.వేడుకలకు అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, అంబులెన్స్, విద్యుత్, టెంట్లు, కుర్చీల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని తెలిపారు.

# మేడ్చల్--మల్కాజ్‌గిరి సంక్షేమ సంస్థల్లో ఆహార భద్రత కమిషన్ తనిఖీలు

**మేడ్చల్--మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 11 శుభోదయ దైనమిక్ :** గర్భిణీలు, చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, పోషకాహారం అందించడంలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలో కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్, సభ్యులు ఆనంద్, జ్యోతి కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మెద్చల్ తహసీల్దార్ కార్యాలయంలో కీసర ఆర్డీవో వెంకట్ రెడ్డి కమిషన్ సభ్యులకు స్వాగతం పలికారు. రేషన్ దుకాణాల తనిఖీలో భాగంగా చైర్మన్ స్టాక్ వివరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేయాలని, జిల్లా పౌర సరఫరాల అధికారి, మండల తహసీల్దార్ల ఫోన్ నంబర్లను స్పష్టంగా ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. సబ్సిడీ బియ్యం అందుతున్న తీరుపై లబ్ధిదారులతో మాట్లాడారు. కిష్టాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను కమిషన్ బృందం తనిఖీ చేసింది. భోజనశాల, వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించి, ఆహార పదార్థాల గడువు తేదీలను తనిఖీ చేశారు. నాణ్యమైన బియ్యాన్ని మాత్రమే వినియోగించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న ఉడికించిన గుడ్లను కూడా పరిశీలించిన శ్రీనివాస్, వాటి రంగు మారడంపై నమూనాలను సేకరించి పరీక్షలకు పంపాలని, నివేదిక సమర్పించాలని అధికారులను





ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షల రిజిస్టర్లను పరిశీలించిన ఆయన, రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. తల్లిదండ్రుల కమిటీ రికార్డులను కూడా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ఆహార నాణ్యత, నిర్ణీత మెనూ, తాగునీరు, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. దమ్మాయిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీ సందర్భంగా పలువురు విద్యార్థులు ఇంటి నుంచి భోజన పెట్టెలు తీసుకువస్తున్నట్లు కమిషన్ గమనించింది. పాఠశాలలో సరైన ఆహారం అందడం లేదని తెలియడంతో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. పాఠశాలను మరోసారి తనిఖీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ నగర్, దమ్మాయిగూడ, జవహర్ నగర్, మల్కాపురం ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బృందం సందర్శించింది.

చిన్నారులు, గర్భిణీల హాజరు వివరాలను పరిశీలించడంతో పాటు పోషకాహారం, గుడ్లు, పాలు సరఫరా పరిస్థితిని తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఆహార మెనూను తప్పనిసరిగా ప్రదర్శించాలని చైర్మన్ ఆదేశించారు. గర్భిణీలు, 14 ఏళ్లలోపు పిల్లలకు పోషకాహారం అందించడం వారి చట్టబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. లబ్ధిదారుల హక్కులను పరిరక్షించేందుకు కమిషన్ చర్యలు తీసుకుంటుందని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఫిర్యాదు చేసేందుకు గర్భిణీలకు కమిషన్ సంప్రదింపు నంబర్లను అందించారు.

ఈ తనిఖీల్లో నోడల్ అధికారి సాంబశివరావు, జిల్లా సంక్షేమ అధికారులు ఝాన్సీ రాణి, వినోద్ కుమార్, పద్మజ, కాంతమ్మ, డీఎంహెచ్ఓ ఆనంద్, పౌర సరఫరాల అధికారులు సుగుణాబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ సెస్ బకాయిలను వేగంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్-మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 11శుభోదయ దైనమిక్ :** పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ సెస్ బకాయిలను వేగంగా వసూలు చేసి, సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, సెస్ చెల్లింపుల డిజిటల్ ట్రాకింగ్‌ను పటిష్టం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

గ్రంథాలయ సెస్ వసూళ్లు, పెండింగ్ బకాయిలు, మౌలిక వసతుల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధ్యక్షత వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి పేరం సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి మున్సిపాలిటీ తమ పెండింగ్ గ్రంథాలయ సెస్ బకాయిలను ప్రాధాన్యతా క్రమంలో చెల్లించాలని సూచించారు. ప్రతి మున్సిపాలిటీ నుంచి నెలకు రూ. 2 లక్షల



చొప్పున చెల్లించేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. సంస్థల వారీగా బకాయిలను పర్యవేక్షిస్తూ, జిల్లా గ్రంథాలయ సంస్థకు సెస్ నిధులు క్రమం తప్పకుండా జమ అయ్యేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

2026 ఏప్రిల్ నుంచి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (+ఎవీజ) నుంచి నెలకు రూ. 5 లక్షల గ్రంథాలయ సెస్ అందకపోవడాన్ని కూడా సమావేశంలో సమీక్షించారు. పెండింగ్ నిధులను త్వరగా విడుదల చేయించేందుకు సంబంధిత అధికారులకు లేఖలు రాయాలని నిర్ణయించారు. ఈ-సేవా కేంద్రాల ద్వారా వసూలవుతున్న గ్రంథాలయ సెస్ చెల్లింపులను సమగ్రంగా ట్రాక్ చేసేందుకు డిజిటల్ వ్యవస్థను ప్రవేశపెట్టే ప్రక్రియకు సంబంధించిన ఫైళ్లను సిద్ధం చేయాలని కార్యదర్శి పేరం సురేష్ బాబును అదనపు కలెక్టర్ ఆదేశించారు.

# సెక్షన్ 22ఏ జాబితా నుంచి భూములను తొలగించాలని కూకట్‌పల్లి ఆర్‌డబ్ల్యూఏల డిమాండ్

మేడ్చల్--మల్కాజిగిరి సెప్టెంబర్ 11 శుభోదయ దైనమిక్:కూకట్‌పల్లిలో భూ హక్కుల అంశంపై ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని వసంత్ నగర్, సర్దార్ పటేల్ నగర్‌తో పాటు ఇతర కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల (ఆర్‌డబ్ల్యూఏ) ప్రతినిధులు శుక్రవారం సమావేశమై తమ భూములను నిషేధిత సెక్షన్ 22ఏ జాబితా నుంచి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నేతృత్వంలో ప్రతినిధుల బృందం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావులకు విజ్ఞప్తి సమర్పించి, సమస్య పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కోరింది.

మీడియాతో మాట్లాడిన స్థానిక సంఘాల ప్రతినిధులు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సెక్షన్ 22ఏ నిబంధనల కారణంగా ప్రజల జీవనోపాధి, ప్రైవేట్ ఆస్తి హక్కులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని అన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో సెక్షన్ 22ఏ కింద ఉన్న భూములను వెంటనే తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా భూ యజమానుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందని అన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రజా ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు మందడి



శ్రీనివాసరావు, అవుల రవీందర్ రెడ్డి, పగడాల సిరీష్ బాబు రావు, సబీహా గౌసుద్దీన్ తదితర రాజకీయ, స్థానిక నాయకులు, ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వరికపూడిసెల ఎత్తిపోతల పనులు కొరకు మంత్రి నిమ్మలను కలసిన.... ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి.

**కారంపూడి, సెప్టెంబర్ 11, (పల్నాడు జిల్లా)** శుభోదయ దైనమిక్ : - పల్నాటి ప్రజలు ప్రతిష్టాత్మకంగా, ఎంతో కాలం నుండి ఎదురుచూస్తున్న వరికపూడిసెల ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలని గురువారం సాయంత్రం భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను సచివాలయంలో కలసిన నర్సాపేట పార్లమెంట్ సభ్యులు లావు కృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పురోగతి పైన మరియు త్వరితగతిన పనులు పూర్తి చేయటం పై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి రామానాయుడు తో పాటు , పార్లమెంట్ సభ్యులు లావు కృష్ణదేవరాయులు, శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రాజెక్టు భూసేకరణ కోసం కూటమి ప్రభుత్వం ఇప్పటికే 63.14 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, పైప్ లైన్ నెట్వర్క్ పనుల కోసం భూసేకరణను డిసెంబర్ చివరినాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు.

" అక్టోబర్ 31 నాటికి 84,500 ఎకరాలకు సాగునీరు అందించేలా డి పి ఆర్ మరియు పబ్లిక్ హియరింగ్ పూర్తిచేసేలా నిర్ణయించారు. అదేవిధంగా ఈ పథకానికి అవసరమైన పర్యావరణ అనుమతులను కేంద్ర ప్రభుత్వం వద్దనుండి త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ కృష్ణదేవరాయలు తెలియజేశారు. పల్నాడు ప్రాంత రైతులకు సాగునీరు అందించడమే ధ్యేయంగా ఈ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేస్తుందని మంత్రి రామానాయుడు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. వరస ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు సాగు, త్రాగునీరు అందిస్తున్న కూటమి ప్రభుత్వం లోని మంత్రులకు,శాసనసభ్యులకు మరియు నీటి మనిషి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వరికపూడి సెల ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తిచేసి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా పల్నాటి ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు



**నేరేడుచర్ల,శుభోదయ దైనమిక్** శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని బోనాలను సమర్పించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దేవరశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట 78వ వార్షికోత్సవం

ప్రపంచానికి పోరాటం నేర్పిన తెలంగాణ: ధనుంజయ నాయుడు



**నేరేడుచర్ల, శుభోదయ దైనమిక్** మండలంలోని గంటవారిగూడెంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 78వ వార్షికోత్సవ వేడుకలను సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాగిన పోరాటం చారిత్రాత్మకమన్నారు. పేదలకు భూములు పంచి, తెలంగాణను భారతదేశంలో విలీనం చేయడంలో పోరాటం కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రస్తుతం మతోన్మాద శక్తులు దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ కార్మిక, శ్రామిక వర్గాలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలపై మరోసారి ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, రావుల సత్యం, ముత్యాల భాస్కర్, ఊదర వెంకన్న, కొమర్రాజు వెంకట్, ఎస్కే సయ్యద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రెండు జతల స్కూల్ యూనిఫామ్‌ల పంపిణీ



**నేరేడుచర్ల,శుభోదయ దైనమిక్** పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్లలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్కూల్ యూనిఫామ్‌లను మున్సిపల్ చైర్మన్ కొనతం వెంకటరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న పలు సౌకర్యాల్లో భాగంగా రెండు జతల స్కూల్ యూనిఫామ్‌లు అందించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్. నాగరాజు, కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, టీఎంసీ మెప్మా శ్వేత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు


## మట్టి వినాయకులనే పూజిద్దాం

పర్యావరణాన్ని కాపాడుకుందాం: మదార్




**నేరేడుచర్ల,శుభోదయ దైనమిక్** వినాయక చవితిని పురస్కరించుకుని పినాకిల్ పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు స్వయంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాలు, పర్యావరణ నినాదాలతో నేరేడుచర్ల పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మట్టి విగ్రహాల ప్రాధాన్యతను, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగుల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పినాకిల్ విద్యాసంస్థల అధినేత మదార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కరించకపోతే హైవే దిగ్బంధం



**కోదాడ,శుభోదయ దైనమిక్** రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించకపోతే జాతీయ రహదారులను దిగ్బంధించి, సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ హెచ్చరించారు. విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు, రైతులతో కలిసి సూర్యాపేట విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. అప్రకటిత విద్యుత్ కోతలు, నాణ్యత లేని సరఫరాతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని, సాగర్ జలాలను విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. వరి కోతలు పూర్తయ్యే వరకు సాగునీటి సరఫరా షెడ్యూల్‌ను ప్రకటించాలని కోరారు. మూడు, నాలుగు రోజుల్లో పరిస్థితి మెరుగుపడకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి హైవే దిగ్బంధం, నియోజకవర్గంలోని సబ్‌స్టేషన్ల ముట్టడి చేపడతామని హెచ్చరించారు. సమస్యను ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎస్ఈ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## కారంపూడి సబ్‌స్టేషన్‌లో నూతన 33 కేవీ ఫీడర్ ప్రారంభం



**కారంపూడి,శుభోదయ డైనమిక్** కారంపూడి సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 33 కేవీ ఫీడర్‌ను పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ పి. ప్రత్తిపాటి విజయకుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన 33 కేవీ ఫీడర్ అందుబాటులోకి రావడంతో సబ్‌స్టేషన్‌పై ఉన్న అధిక విద్యుత్ లోడ్ తగ్గడంతో పాటు ఇతర ఫీడర్లపై భారం తగ్గుతుందని తెలిపారు. దీంతో పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నాణ్యత, విశ్వసనీయత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ప్రతి నెలా క్రమం తప్పకుండా విద్యుత్ బిల్లులు చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాచర్ల డీఈ సింగరయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆనందరావు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి: ఎస్పీ నరసింహ



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్**
జిల్లా పోలీస్ కార్యాలయంలో సూర్యాపేట డివిజన్ పోలీసు అధికారులతో ఎస్పీ కె. నరసింహ శుక్రవారం నెలవారీ సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తు పురోగతి, ఆన్‌లైన్ నమోదు, ఈ–సాక్షి, ఛార్జ్‌షీట్ల దాఖలు, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్షించారు. కేసులు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

**గణేశ్ ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి**
రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. గణేశ్ మండపాల ఆన్‌లైన్ నమోదు, నిత్య పర్యవేక్షణ, నిమజ్జనం, శోభాయాత్ర మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు, ఎస్ఐలు, డీసీఆర్బీ, స్పెషల్ బ్రాంచ్, సీసీఎస్, సైబర్ సెక్యూరిటీ, ఫింగర్ ప్రింట్, షీ టీం, భరోసా, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద కొదమగుండ్ల లైన్మెన్ గోపాల్ హఠాన్మరణం



**కారంపూడి, శుభోదయ డైనమిక్** కారంపూడి మండలం పెద కొదమగుండ్ల విద్యుత్ శాఖలో లైన్మెన్‌గా పనిచేస్తున్న గై గోపాల్ గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు, గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గోపాల్ 2004లో జూనియర్ లైన్మెన్‌గా శాశ్వత ఉద్యోగంలో చేరి పదోన్నతులతో లైన్మెన్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మాచర్ల డీఈ ఎన్. సింగయ్య, గురజాల డీఈఈ ఆనంద్ గోపాల్ పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శాఖా నిబంధనల ప్రకారం కుటుంబానికి రావాల్సిన ప్రయోజనాలు, పెన్షన్, ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సహోద్యోగులు, యూనియన్ నాయకులు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి



**కోదాడ, శుభోదయ డైనమిక్** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు అన్నారు. కోదాడ 34వ వార్డు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫాంలు, షూలను కౌన్సిలర్ గంధం బాలేంద్ర, పాండుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, షూలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వార్డు నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మునిగడప పాఠశాలలో ముందస్తు గణపతి



**శుభోదయ డైనమిక్** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని మునిగడప ప్రైమరీ పాఠశాలలో ముందస్తు వినాయక చవితి ప్రధానోపాధ్యాయులు శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో శ్యామల మాట్లాడుతూ పిల్లలకు మట్టి గణపతినే పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిల్లలకు సూచించారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ భగవాన్ రెడ్డి పద్మ పిల్లలు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై వ్యాఖ్యలు బాధాకరం

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్ నేతలు



**సూర్యాపేట,శుభోదయ డైనమిక్** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. దళితులు ఉన్నత పదవుల్లోకి ఎదగడాన్ని ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దూదెం వెంకట రమణ, పటేల్ రమేష్ రెడ్డి, గుడిపాటి నర్సయ్య తదితరులు మాట్లాడారు. రాజ్యాంగబద్ధ పదవులను కించపరచడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. స్పీకర్‌తో పాటు ఆయన కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వద్ద నిరసనలు శాంతియుతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించాలని సూచించారు.

## కనకదుర్గమ్మ తల్లి నూతన స్లాబ్ ప్రారంభోత్సవం చేసిన కీసర సంతోష్ రెడ్డి



**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతే సెప్టెంబర్ 10** మోతే మండలం రాంపురం తండా గ్రామంలో కనకదుర్గమ్మ తల్లి దేవాలయం నూతన స్లాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మోతేమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోతు సత్యమ్మ శ్రీను ఉపసర్పంచ్ మోహన్. గ్రామ శాఖ అధ్యక్షులు లక్కుడు. కాంగ్రెస్ నాయకులు పొట్టి. రమేష్ గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## శాసన సభ్యురాలు ఉత్తం పద్మావతి రెడ్డి సహకారంతో 70.000 ఆర్థిక సాయం



**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతే సెప్టెంబర్ 10** మోతే మండలం రాయి కుంట తండా ( రాందాస్ తండా ) గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న దస్రు పరామర్శించిన ప్రియతమ నాయకురాలు ఉత్తం పద్మావతి రెడ్డి సహకారంతో 70 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించిన మోతే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి ఈ యొక్క కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య గౌడ్. గ్రామ సర్పంచి భూక్య ఉప్పయ్య. కాంగ్రెస్ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు గౌడ్. తుమ్మేటి అశోక్ రెడ్డి. భుక్య రవి. టింకు. లచ్చు నాయక్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారుద

## కార్మిక సంఘ నాయకుడు రామిశెట్టి వెంకయ్య మృతి బాధాకరం.....



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్** : కార్మిక సంఘం నాయకులు రామిశెట్టి వెంకయ్య మృతి బాధాకరమని హమాలి కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు, సాగర్ ఎడమ కాలువ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మేకల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో అనారోగ్యంతో బాధపడుతూ గుండెపోటుతో మృతి చెందిన రామిశెట్టి వెంకయ్య మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుజూర్నగర్ ప్రాంతంలో కార్మికుల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడిని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతాల కోసం ఎమర్జెన్సీని కూడా వ్యతిరేకించి చివరివరకు పోరాడిన నాయకుడు అన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. నివాళులు అర్పించిన వారిలో ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కోలా ఉదయభాను ఉపేందర్, 16 వార్డు కౌన్సిలర్ చిట్టిపోతుల భద్రమ్మ,రమేష్, సిపిఐ ఎంఎల్ డెమోక్రసీ నాయకులు కాకి ఆజయ్ రెడ్డి, కాకి భాస్కర్, నూకల చంద్రం, మాజీ కౌన్సిలర్ కేఎల్ఎన్ రావు చౌదరి, రామిశెట్టి రాము, రామిశెట్టి శ్రీనివాసు, నరసింహారావు, రామ్ శెట్టి రాంనర్సయ్య, తాళ్లూరి వెంకటేశ్వరరావు, రామ్ శెట్టి ఉపేందర్ వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు

## ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా..? జనావాసాల మధ్య సెల్‌టవర్!

ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట టవర్ ఏర్పాటుపై స్థానికుల ఆందోళన



**శుభోదయ డైనమిక్ -- హుజూర్‌నగర్** హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణ పనులు చేపట్టడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టవర్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్నారు.
మున్సిపల్ కమిషనర్‌కు పిటిషన్
సెల్‌టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కాలనీవాసులు, మహిళలు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్‌కు పిటిషన్ సమర్పించారు. నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేసి, అనుమతులు, భవన సామర్థ్యం, నిబంధనలపై సమగ్ర విచారణ జరిపి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ముదిరాజ్ బంధువుల ముందస్తు అరెస్టు

బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని డిమాండ్

న్యాయమైన డిమాండ్ పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామన్న ముదిరాజులు




**హుజూర్‌నగర్,శుభోదయ డైనమిక్** ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ కేటగిరీలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న ముదిరాజ్ కులబంధువులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ బంధువులు మాట్లాడుతూ.. ఎన్ని అరెస్టులు చేసినా తమ న్యాయమైన డిమాండ్ పరిష్కారమయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మారుస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చే ప్రక్రియను వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంటు నాగరాజ్, లక్క వెంకన్న, ములకలపల్లి రాంబాబు, శీలం వెంకీ, సుంకర ప్రసాద్, ములకలపల్లి లక్ష్మణ్, బుడిగె మహేష్, కొమరబోయిన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.ద

## నేరేడుచర్లలో ఘనంగా హిందీ దివస్ ముందస్తు వేడుకలు

హర్యానా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థుల ప్రదర్శనలు

భిన్నత్వంలో ఏకత్వానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదం




**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్** సెప్టెంబర్ 14న నిర్వహించనున్న హిందీ దివస్‌ను పురస్కరించుకుని నేరేడుచర్ల పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు హర్యానా రాష్ట్ర ప్రజల వేషధారణలు, నృత్యాలు, నాటికలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హర్యానా ప్రజల భాష, ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాలు, ముఖ్యమైన పండుగలు, జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను ఏకం చేయడంలో హిందీ భాష కీలక పాత్ర పోషించిందని ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, హిందీ ఉపాధ్యాయురాలు ఎం. నాగమణి తెలిపారు. దేశంలోని భిన్న సంస్కృతులు, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా భిన్నత్వంలో ఏకత్వం సాధించవచ్చని వారు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం

-మొదటిపేజీ తరువాయి

2025–26లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.23,729 కోట్లు, 2026–27లో రూ.27,663 కోట్లు కేటాయించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. పేదలకు మేలు జరగాలనే కీలకమైన విద్యాశాఖను తన వద్ద ఉంచుకున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలు 28,163 ఉన్నాయని, 28.77 లక్షల మంది విద్యార్థులు వాటిలో చదువుతున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మూడేళ్లలో విద్యాశాఖపై రూ.7,554 కోట్లు అదనంగా ఖర్చు పెట్టామని రేవంత్ రెడ్డి వివరించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలని కానీ, తెలంగాణలో మాత్రం 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని గుర్తుచేశారు. 55 రోజుల్లో 10,600 మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేశామన్నారు. ఏ చిన్న ఆరోపణ కూడా లేకుండా డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. 10ఏళ్లపాటు అధికారంలో ఉన్న

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA